భద్రత

ప్రత్యేకతెలంగాణా ఉద్యమ కాలంలో నేను హైస్కూల్‌చదువులో ఉన్నాను. శ్రీకాకుళపోరాటాలాగి తెలంగాణాలో పోరాటాలు వేళ్ళూనుకుంటున్న సమయంలో డిగ్రీ చదువుతున్నాను. రాజేశ్, విజయ్, చక్రవర్తి నాకు క్లాస్‌మేట్స్. మేమప్పుడెన్నో విషయాలను చర్చించుకునేవాళ్ళం... మేమెప్పుడు కల్సినా ఈ వ్యవస్థ. గూర్చే మాట్లాడుకునే వాళ్ళం.

బలవంతులు దుర్బల జాతిని
బానిసలను గావించారు
నరహంతలు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి.

అంటూ శ్రీ శ్రీ మహాప్రస్థానం గేయాలను రాజేశ్ ఆవేశపూరితంగా చదివేవాడు... ఆగేయాలు వింటున్నా, చదువుతున్నా మారక్తం సలసలా మరిగేది... మాలో ఆవేశం తన్నుకొచ్చేది...

పతితులార భ్రష్టులార... బాధా సర్పద్రష్టులారా... అంటూ మేం కలిసి పాడుకునే వాళ్ళం.... అందులోని చాలా గేయాలు రాజేశ్‌కు కంఠతా వచ్చేవి.

''మనోహర్! ఈ వ్యవస్థ మెజారిటీగా ఉన్న దేశప్రజల ప్రయోజనాలనుకాపాడేది కాదు... ఇది పునాదులతో సహా మారాలి... అనేవాడు రాజేశ్ నాతో...

నాకూ అవుననిపించేది... శ్రీ శ్రీ కోరిన మరో ప్రపంచం కోసం కలలు కంటుండే వాళ్ళం మేం... ఆ వ్యవస్థకోసం కానరాని కాంక్షలతో నాలోనేను మదనపడుతుండేవాన్ని... అది నాకొక స్వప్నం లాగే అనిపించేది... శ్రీ శ్రీ శివసాగర్, చెరబండరాజుల పాటలు చదువుతుంటే మా రక్తము ప్పొంగి పోయేది...

''ఇది మనిషిని మనిషి దోచుకుతినే సమాజం... మనిషిని మనిషిగా చూసే సమాజం కావాలి మనకు. అందుకోసమే పోరాటాలు జరుగుతున్నాయి. మనోహర్ నా వంతు పాత్రనేను నిర్వహిస్తాను...'' అన్నాడోసారి నాతోరాజేశ్.

రాజేశ్ మాటలు నిజమే అయినా నాకూ అందులో దూకుదామన్నంత ఆవేశం వచ్చినా ఎందుకో ఆ మాటలు విని భయపడ్డాను... ఇలా అయితే చదువులేం కావాలి...? నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులేం కావాలి? అనుకున్నాను... నాకందులోకి పోయేధైర్యం లేకున్నా ఆ ఉద్యమమంటే సానుభూతుండేది... అది విజయవంతం కావాలని మనసారా కోరుకునే వాన్ని...

''ఈ చదువులు కేవలం గుమస్తాలను తయారు చేయడానికే ఉపయోగపడ్తాయి... ఇవి నిరర్థకం... ఈ చదువుల కోసం దశాబ్దాల కాలం వృధా చేసుకుంటున్నాం...'' అన్నాడు నాతో ఓ రోజు...

''రాజేశ్'' ఆ వ్యవస్థరావాలి నిజమే... కాని అది మనసుంచవుతందా? చదువులను నిర్లక్ష్యం చేస్తే తల్లిదండ్రుల గతేం కావాలి? అన్నాను...

''మనం మన తల్లిదండ్రుల గూర్చి మాత్రమే ఆలోచిస్తున్నాం... మనోహర్! ఉద్యమకారులు చెరలో ఉన్న మన దేశమాత గూర్చి ఆలోచిస్తున్నారు...?' అని నానోరు మూయించాడు రాజేశ్...

రాజేశ్ రాత్రుల్లో గోడలపై రాతలురాయడం. కరపత్రాల్లాంటివి పంచడం చేస్తుండేవాడు. క్రమక్రమంగా చదువును నిర్లక్ష్యం చేసి అందులోనే కూరుకు పోతున్నాడు. నాకూ ఎంతో ఆవేశం నన్ను నేను అదుపులో పెట్టుకుంటూ చదువులో నిమగ్నమయ్యేవాన్ని... రాజేశ్ పనులకు భయపడి చక్రవర్తి, విజయ్ దూరముండటం మొదలుపెట్టారు. నాకు మాత్రం రాజేశంటే అపరిమితమైన ప్రేమ... వాళ్ళు కోరే వ్యవస్థరావాలన్న తపన... తప్పకుండా వస్తుందన్న ఆశ...

మా డిగ్రీ పూర్తయ్యేసరికి రాజేశ్ పూర్తిగా ఉద్యమాల్లో లీనమై పోయాడు... అప్పుడప్పుడే గ్రామాల్లో ఉద్యమాలు ఉధృతమవుతున్నాయి.. డిగ్రీ సర్టిఫికెట్ బ్యాగులో వేసుకొని నేనుద్యోగం కొరకు కాళ్ళరిగేలా తిరుగుతున్నాను... రాజేశ్ పేరును పేపర్లలో చూస్తున్నాను... రాజేశ్ మాట్లాడే బహిరంగ సభలకు జనాలు వేల సంఖ్యలో వస్తున్నారని వింటున్నాను. ఉద్యోగం దొరకడం ఆలస్యమవుతున్న కొద్దీ నాకీ వ్యవస్థపై కోపం పెరుగుతుంది. ఉద్యమాల్లో దూకుదామన్నంత ఆవేశమొస్తుంది... రాజేశ్ జ్ఞాపకం వస్తున్నాడు... అయినా ఉద్యోగ ప్రయత్నాలు తీవ్రంగానే చేస్తున్నాను. చాలా కాలం వరకుద్యోగం దొరుకకుంటే ఏం జరిగేదో కాని నాకు త్వరలోనే ఉద్యోగం దొరికింది.

ఉద్యోగంలో చేరిన రోజున నేనెంతో సంతోషించాను. మా కుటుంబ సభ్యుల ఆనందానికైతే అంతే లేదు... మా వంశంలోనే మొట్టమొదటి ప్రభుత్వ ఉద్యోగిని నేను... పెళ్ళి, పిల్లలతో పాటు క్రమక్రమంగా ఉద్యోగంలోనూ ప్రమోషన్లతో ఎదుగుతున్నాను నేను. అటురాజేశ్‌రహస్య జీవితానికెళ్ళి ఉద్యమంలో ప్రముఖపాత్ర వహిస్తున్నట్టు వార్తలుచదువుతున్నాను. పదేళ్ళ తర్వాత మొట్టమొదటిసారిగా 'రాజేశ్ ఏదో ఉద్యోగం చేస్తూ హాయిగా బతుకక ముండ్లబాటనెందుకెన్నుకున్నాడు?'' అనుకున్నాను నాలో నేను.

స్వల్పమైన ఒడిదుడుకులున్నా జీవితమిప్పుడుసాఫీగానే సాగిపోతుంది. నేనిప్పుడు ఆలోచించడం మానుకొన్నాను. ఇతర విషయాల గూర్చి పట్టించుకోవడమూ మానుకున్నాను. నేను, నా ఉద్యోగం నా భార్య పిల్లలు, కుటుంబం ఇంతవరకే నా జీవితాన్ని పరిమితం చేసుకున్నాను... నా పిల్లల ఉజ్వల భవిష్యత్తు కొరకు, వాళ్ళ పై చదువుల కొరకు కొంతైనా డబ్బు కూడబెట్టా? ప్రయత్నిస్తున్నాను. నాముందిప్పుడు ఒకే లక్ష్యముంది... అది నా పిల్లలు ఉన్నతోద్యోగాల్లో చేరడం లక్ష్యం గుర్తుకొచ్చి ఆవేశాన్నణంచుకున్నాను.. దేశం అభివృద్ధే చెందలేదనడం, వ్యవస్థపై కసిపెంచుకోవడం అర్థం లేనిదనిపిస్తుంది నాకిప్పుడు...

గ్రామాల్లో కొన్ని మార్పులు చోటు చేసుకోవడం నా దృష్టిని దాటిపోలేదు... రాజేశ్‌కు ఎన్నో హింసాయుత సంఘటనలతో సంబంధమున్నట్టు, తను ఉద్యమంలో ఎంతో ఉన్నతస్థానానికెదిగి పోతున్నట్టు వార్తా పత్రికల ద్వారా తెలుసుకుంటున్నాను... అయితే క్రమక్రమంగా నాకు వాళ్ళ పనులు కేవలం తీవ్రవాద

పనులుగానే కనబడసాగాయి... వ్యవస్థ మార్పుకు హింస తప్పదని ఒకప్పుడు చదువుకున్నా వాళ్ళ చర్యలు హింసాపూరితమైనవిగానే అగుపడుతున్నాయి... దోపిడీ, వంచనంటూ వాళ్ళు చేసే పనులన్నీ అతివాద పనులుగానే తోస్తున్నాయి.. విద్యార్థి దశలోని నా ఆదర్శాలు, ఆశయాలు, భావాలు, ఉద్యమాలపట్ల ఆసక్తి క్రమక్రమంగా దూరనువుతున్నాయి. వేడి రక్తంలో ఉన్నప్పుడు నా చుట్టూ ఉన్న ప్రాంతంలో ఉద్యమాలు ఉవ్వెత్తున లేస్తూ మా ప్రాంతమంతా అల్లకల్లోల మవుతున్న అగ్నిగుండంగా మారినా నేనేమీ పట్టించుకోవడం లేదు...

నాకిప్పుడీ సమాజంలో భద్రత ఉన్నట్టే అనిపిస్తుంది.. నాకుద్యోగమిచ్చి ఎంతో కొంత సుఖంగా బతకడానికి దోహదం చేసిన ఈ వ్యవస్థపై నాకు నమ్మకం పెరుగుతుంది.. ఎవరి పనులు వారు చూసుకోక సమాజంలో ఏదేదో ఉందని గొంతు చించుకోవడం అనవసరమనిపిస్తుంది... ఉద్యోగంలోనూ, జీతంలోనూ కొంతకొంత ఎదుగుదల రావడం వల్ల నా భద్రతపై మరింత నమ్మకం పెరుగుతుంది. అందుకోసం నాకు శక్తికి మించిందే అయినా నా పిల్లలను మంచి ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాను. వాళ్ళ ఉన్నతిని చూడటమే ధ్యేయంగా చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష అనుకుంటూ బతుకుతున్నాను.

నా డిగ్రీ చదువయిపోయి దాదాపిరవై ఏళ్ళయింది... నా పిల్లలిప్పుడు హైస్కూలు చదువుల్లో ఉన్నారు. నా ఉద్యోగం ఫర్వాలేదు.. నామిత్రులు చక్రవర్తి, విజయ్ మంచి ఉద్యోగాల్లో స్థిరపడి పోయారు. రాజేశ్ ఉద్యమంలో తలమునకలవుతూ సుప్రీమ్ స్థితికి చేరుకున్నట్టు వార్తల వల్ల తెలుస్తుంది. మిత్రులు కలిసినప్పుడు మేం రాజేశ్‌గూర్చి మాట్లాడుకుంటుంటాం... మా మిత్రుల్లో అతడొక్కడే అలా అయ్యాడని జాలిపడుతుంటాం... రాజేశ్ కోరికష్టాలను తెచ్చుకున్నాడని సానుభూతి చూపుతుంటాం.. మాకు మేం మంచిగానే ఉన్నామని సంతృప్తి పడ్తుంటాం... మాకున్న జీవిత భద్రత గూర్చి ముచ్చటించుకుంటాం... ఉద్యమం పేరు మీద జరుగుతున్న రక్తపాతం గూర్చి చర్చించుకుంటాం... మొత్తంగా వ్యవస్థతో రాజీపడి సంతృప్తిగానే బతుకుతున్నామనుకొని బతుకుతున్నాం.

జీతం ఫర్వాలేదనిపించినా నా పిల్లల ఉన్నత చదువులకు మరింత డబ్బు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో ఓ ప్రముఖ పత్రికకు విలేఖరిగా చేరాను.. డ్యూటీ అయిపోయింతర్వాత నాకా పనే.. విలేఖరిగా చేరింతర్వాత నాకనేక విషయాల గూర్చి తెలుసుకోవాల్సిన అవసర మేర్పడింది. అందువల్ల నా అధ్యయనాన్ని విస్తృతం చేయాల్సి వచ్చింది..

ఓ రోజు రాజేశ్ తలపై ఐదు లక్షలు ప్రకటించిన ప్రభుత్వ ప్రకటన వార్తా పత్రికల్లో చూసి తెల్లబోయాను. నా ఆలోచనలు రాజేశ్‌పైకి మళ్ళాయి.

అడవుల్లో రహస్యజీవితం గడుపుతూ వీళ్ళేం సాధించ దలుచుకున్నారు...? వీళ్ళు ఎండమావుల వెంట పరుగిడుతున్నారా...? వీళ్ళలో ఎంత మంది చురకత్తుల్లాంటి యువకులు బలైపోయారు...? ఇంకెంత మంది బలికానున్నారు..? ఇదంతా ఏంటి...?' నాలో ఎన్నో ప్రశ్నలు.. సమాధానాల కోసమై కొన్ని పుస్తకాలూ చదివాను...

ఇప్పుడా పార్టీకే అధినాథుడైనచిన్న నాటి మిత్రుని ఒక్కసారి కలుసుకుంటే బాగుండునని అనేక సార్లనుకున్నాను.

. ఆ అవకాశం మా పత్రిక తరఫున విలేఖరి రూపంలో నాకు, అమర్‌కు దొరికింది. మా పత్రిక ఆతనితో ఇంటర్వ్యూ ప్రచురించడానికి ఎన్నోసార్లు ప్రయత్నించి విఫలమైంది. అనుకోకుండా రాజేశ్

ఇంటర్వ్యూ ఇవ్వడానికి మా పత్రికకు రహస్య సందేశం పంపాడు. నేను అమర్‌రాజేశ్ అనుచరులతో కొన్ని పదుల మైళ్ళు అడవిలో నడిచి స్థావరం చేరుకున్నాం. రాజేశ్‌ను చూడగానే నా ఇరవై ఏళ్ళ క్రితపు కాలేజీ జీవితం జ్ఞాపకం వచ్చింది.. మేం చదివిన పుస్తకాలు జ్ఞాపకం వచ్చాయి. చర్చించిన విషయాలు మదిలో మెదిలాయి. ఆ తర్వాత మా మార్గాలు వేరు కావడం కళ్ళముందు కదిలాయి.. ఎంతో చురుకైన రాజేశ్, చీమకైనా హానితలపెట్టని రాజేశ్ రక్తసిక్త రాజకీయాల్లో మునిగి తేలుతున్నాడంటే, ఆ పార్టీకే నాయకత్వం వహిస్తున్నాడంటేనాకు నమ్మశక్యం కాకుండా ఉంది... అయినా నా కళ్ళెదుటే ఆతడుంటే కాదనడమెలా?

రాజేశ్‌ను నేను కౌగిలించుకోబోయాను.. నన్ను వారించి చేతిలో చేయి కలిపాడు... నా మిత్రునికీ చేయి కలిపాడు.

బాగున్నవా మనోహర్...?'' అడిగాడురాజేశ్ తలూపాను నేను.

అమర్‌ను, నన్ను కూర్చోమన్నాడు... మాకెదురుగా తానూ కూర్చున్నాడు. ఆతని చుట్టూ నలుగురైదుగురు ఆయుధాలతో నిల్చొనున్నారు... దూరంగా మరో నలుగురు కాపలా కాస్తున్నారు.

రాజేశ్ దిక్కు పరీక్షగా చూసాను... ఎండలో తిరిగిన వాడికున్నట్టుగా ముఖం మాడిపోయింది. చూస్తేనే మధ్య వయసు వాడిలా కనబడుతూనేన్నాడు... మునుపట్లాగే బక్కపలుచగానే ఉన్నాడు.. ముఖంలో అదే చురుకుదనం... ఎంతో మంది భూస్వాములు ఊళ్ళొదిలి పెట్టడానికి కారణమైన పార్టీకి, ఎంతో అల్లకల్లోలం మార్పుకు మూలమైన పార్టీకి నాయకత్వం వహించే పార్టీ సిద్ధాంతాల గూర్చి, వ్యవస్థ గూర్చి అడిగినరెండు మూడు ప్రశ్నలకు ఏ మాత్రం తొణకకుండా జవాబులిచ్చాడు రాజేశ్.. ఎంతో పరిణతిచెందిన వాడిలా సమాధానా లిచ్చాడు.. ఎట్టి పరిస్థితిలోనూ తానెన్నుకున్న మార్గం తప్పవుతుందనితాననుకోవడం లేదని ఆతని మాటల వల్ల అర్థమవుతుంది... వాళ్ళ హింసాకాండగూర్చి ఆతని ముఖంలో పశ్చాత్తాపం కనబడు తుందనుకున్ననాకు నిరాశేమిగిలింది. ఆతని భావాల్లో ఏ మార్పూ కనపళ్ళేదు... కొద్ది క్షణాలాగి నన్ను చూసి నవ్వాడు రాజేశ్.. ఆ నవ్వులో నాకెన్నో అర్థాలుకనిపించాయి. నన్నేదో బచ్చాగాడనుకుంటున్నట్టుగా నా వైపు జాలిగా చూస్తూ నవ్వినట్టనిపిచింది.. దినదినగండంగా బతుకుతున్న ఆతని బతుకును చూసినేను జాలిపపడాల్సిందిపోయి హాయిగా బతుకుతున్నానుకుంటున్న నాపై జాలి చూపడం నాకు రోషం తెప్పించింది.. ఎంత గడగడలాడించే పార్టీ నేతయినా ఒకప్పటి నా సహపాఠేనన్న ధైర్యముంది నాకు.. ఆతన్ని ఏకవచనంలోనే సంబోధించాలనుకున్నాను.

''రాజేశ్! ఈ అడవిలో క్రూరజంతువుల మధ్య అటు పోలీసుల భయంతో ... జంతువుల భయంతో బతకడం దేనికి...? ప్రభుత్వం నీకుద్యోగ మిస్తానన్నప్పుడు విరమించుకుంటే సరిపోయేది..? ఏదో ఉద్యోగం చేసుకుంటూ బతుకక ఎందుకలా భయంభయంగా బతకడం...? ఎందుకీ నిప్పుతో చెలగాటం...? మీరా వ్యవస్థనే కొండను ఢీకొంటున్నారు.. పిడికెడు మందున్నారు మీరు... మీ వల్ల ఇది సాధ్యమవుతుందా...?'' అన్నాను.

నా మాటలకాతని ముఖంలో రంగులు మారాయి.. కొద్ది క్షణాలు మౌనంగా ఉండిమెల్లగా అన్నాడు.

''మనోహర్..! ఆ మానవారణ్యంలో కంటె ఈ అరణ్యమే సురక్షితమైందని భావిస్తాం మేం... ఈ క్రూరజంతువులు మానవ మృగాలకంటె భయంకరమైనవేం కావు... మేం పిడికెడు మందిమే ఉన్నామని నీ ఉద్దేశ్యమా...? మా వెంటవేలాది జనమున్నారన్న విషయం మరచి పోవద్దు... ఇక భయం గూర్చి ఏ క్షణంలో ఏ రూపంలో మృత్యువు ముంచుకొస్తుందో మాకు తెలియదు. వ్యవస్థ మార్పుకోసం మేం

మృత్యువును కౌగలించుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాం. మాకు చావంటేనే భయం లేనప్పుడింకేం భయముంటుంది...? మేం జీవితంలో చచ్చేది ఒకేసారి... మరి మీరో...? మనోహర్... ఒక్కసారి గుండెమీద చెయ్యేసుకొని చెప్పు...! మీకెన్ని రకాల భయాలున్నాయో ఒక్కసారి ఆలోచించు.. బతుకుభయం.. భవిష్యత్తు భయం.. పై అధికారంటే భయం.. రేపుపిల్లలెలా బతుకుతారోనన్న భయం.. ధరల భయం.. రక్షణ విషయంలో భయం.. ఇంకా ఎన్నో భయాలుమిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాయి. మీరు భయం లేకుండా బతికిందెప్పుడు? మీరనుక్షణం భయంతో చస్తూనే బతుకుతుంటారు... కాదంటావా...?''

ఆ మాటలతో నాతల తిరిగింది. 'అవును.. నాలాంటి వాడు ఈ వ్యవస్థలో నిర్భయంగా బతికిందెప్పుడు..' నన్నునేనే ప్రశ్నించుకున్నాను.. తల్లి కడుపులో ఉన్న ఆ తొమ్మిది నెలలు మాత్రమే మనిషి నిజంగా బతికేదన్న కవిగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి... అయినా నాకీ వ్యవస్థను ప్రేమించడమే ఇష్టం... 'దేశం నాకేమిచ్చింది..? అనే దానికంటె దేశానికి నేనేమిచ్చాను..?' అని ఆలోచించాలన్న మాటలుజ్ఞాకం వచ్చాయి.. అదే ప్రశ్న రాజేశ్‌కువేసి ఆతన్నిచిక్కుల్లో పెట్టానని సంతోషించాను..

నా మాటలనేం సీరియస్‌గా తీసుకున్నట్టు లేడు రాజేశ్.. ''నిజమే.నీ ప్రశ్న చాలా బాగుంది.. మొదలు దేశానికి నువ్వేమిచ్చావో చెప్పు.. నువ్వంటే నువ్వొక్కడవే కాదు.. నీలాగాజీవించేవాళ్ళు.. నువ్వు నీ భార్య, పిల్లలు, సంసారం, ఉద్యోగం, సుఖం ప్రమోషన్, నీ బతుకంటూ గిరిగీసుకొనున్నావు.. సమాజంలో ఎన్నో సమస్యలున్నా, ఎన్నెన్నో అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నా ఎప్పుడైనా పట్టించుకున్నావా...? మరి మేం చేస్తున్నదేంటి..? దోపిడీ, పీడన లేని వ్యవస్థ కోసం మా ప్రాణాలను ఫణంగా పెడ్తున్నాం.. దేశమంటేమట్టి చెట్లు, గుట్టలు కాదు మనిషన్న విషయం నీకు తెలుసుకదా...! ఆ మనుషుల మంచి బతుకుకోసమే మా ఈ పోరాటాలన్నీ..''

రాజేశ్ మాటలు నా హృదయానికి సూటిగా తగిలాయి.. చాలా కాలంగా నేను బతుకుతున్న బతుకుగూర్చి ఎప్పుడూ ప్రశ్నించుకోని నాకునన్నునేను ప్రశ్నించుకునేలా చేసాయామాటలు.. రాజేశ్ ప్రశ్నలకు జవాబులివ్వకుండానే మరో ప్రశ్న వేసాను.

''ఏ ప్రజల కొరకైతే పోరాటాలు చేస్తున్నారని మీరనుకుంటున్నారో ఆ ప్రజల బతుకులుమీ పోరాటాల వల్ల ఎంత అల్లకల్లోమవుతున్నమో మీరెపుపడైనా ఆలోచించారా...? పోరాట ప్రాంతాలు అగ్నిగుండాల్లా మారి ప్రజల బతుకు దిన దిన గండంగా ఉంది..''

నా ప్రశ్న రాజేశ్‌కు నచ్చలేదని ఆతని ముఖం చూస్తేనే తెలుస్తుంది. ''వ్యవస్థ మార్పు జరుగుతున్న కాలంలో ఇలాంటివి తప్పవు..'' అన్నాడు.'' ''మనోహర్ ప్రశ్నను జెనరలైజ్ చేసి దాటవేస్తున్నారు మీరు.. వ్యవస్థ మార్పును మీరు తీసుకొస్తారా...? లేక ప్రజలు తెచ్చుకోవాలా...? మాస్ జనాలు చేయాల్సిన పనిని అడవుల్లో ఉండి మీరు చేయడం ఎలా సాధ్యమవుతుంది...?'' అన్నాడు అమర్...

రాజేశ్‌ముఖం ముడతలు పడింది.

''మాకు ప్రజాబలం లేందే ఇన్ని రోజులుగా ఎలా ఉండగలుగుతున్నాం..? పోరాట ప్రాంతాలను ఎలా విస్తరించు కోగలుగుతున్నాం? మొదట్లో ఒక్క చోట ప్రారంభమైన ఉద్యమం క్రమక్రమంగా ఎన్ని రాష్ట్రాలకు విస్తరించిందో మీకు తెలియదా...? ఇంకా ప్రజల ఇన్‌వాల్వ్‌మెంట్ పెరుగాలన్న మాట నిజమే అయినా దానికి సమయం పడుతుంది. మాది ఒక్కరోజులో పూర్తయ్యే పోరాటం కాదని గుర్తించుకోవాలి.

సినిమాల్లో వలె హుష్ అంటేవచ్చే మార్పు కాదు..'' అన్నాడు.

''మేం ఆ విషయాన్ని కాదనడం లేదు.. కాని ఏ ఉద్యమం విజయవంత మవడానికైనా ప్రజలు చైతన్య వంతులుకావాలి.. మాకిది కావాలని వాళ్ళేకోరుకోవాలి... ఎవరో చేసిపెట్టడం కాదు.. మొదట్లో సంగతి వేరు కాని ఇప్పుడైతే మీ ఉద్యమాన్ని చూస్తే అలా అనిపించడం లేదు. వ్యక్తిగత కారణాలతోనో, మరే కారణాలతోనో వచ్చిన వాళ్ళే ఎక్కువున్నారు తప్ప పోరాట ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొని వచ్చిన వాళ్ళు తక్కువనిపిస్తుంది.. అంతేకాకుండా మిమ్మల్ని హంతకులుగా, డబ్బులు వసూలు చేసుకొనే వాళ్ళుగా కూడా అనుకుంటున్నారెంతో మంది..''

నా మాటలు విని ముఖం చిట్లించాడు రాజేశ్.. ఆతని ముఖంలో ఏదో తెలియని బాధ కనబడింది నాకు. కొద్ది క్షణాలాగి ''మనోహర్... ఏ వ్యవస్థలోనైనా తమకు నష్టం కలిగే విషయాలు జరుగుతున్నప్పుడు ఆ వర్గం వారు వ్యతిరేక ప్రచారం చేయడం మామూలే... మా పోరాటాల వల్ల నష్టపోతున్న భూస్వామ్య వర్గం, ధనస్వామ్య వర్గం మమ్మల్ని దొంగలుగా, హంతకులుగా తప్పకుండా చిత్రిస్తారు... మా వల్ల కొన్ని తప్పులు జరగడం లేదనడం లేదు.. కాని, అనుక్షణం మృత్యుముఖంలో ఉంటూ జీవన్మరణ పోరాటాలు చేస్తున్నదెవరి కోసం..? మేం బతుక లేకనా...? మాకు బతుక రాకనా...? మనం విద్యార్థులుగా ఉన్నప్పుడు తెలంగాణా గ్రామాలెలా ఉండేవి...? ఇప్పుడెలా ఉన్నాయో ఒక్కసారి చూడు... ఈ మార్పులు మా పోరాటాల ఫలితాలు కావా...?'' అన్నాడు రాజేశ్.

మరోసారి టీ తెప్పించాడు.. సెంట్రీలాతన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారు... చిన్నగా కొమ్మలూగడం, చల్లని గాలి మా మాటలుతప్ప అక్కడంతా నిశ్శబ్దంగా ఉంది.

ఈ విషయంలో రాజేశ్‌తో ఒప్పుకోక తప్పలేదు నాకు... ఒకప్పటి తెలంగాణ గ్రామాలకు ఇప్పటి గ్రామాలకూ చాలా తేడా ఉంది. ఆర్థిక పరిస్థితుల్లో గొప్ప తేడాలు రాకపోవచ్చుకాని దొరా నీ బాంచెన్, అవ్వబాంచెన్, అయ్యబాంచెన్ సంస్కృతి పోయింది. నీ కాల్మొక్త అంటూ పబ్బతి పట్టుకొని నిల్చుండే జనాలే దొరలకు ప్రశ్నార్థకాలై నిలుస్తున్నారు. కొన్ని గ్రామాల్లో హరిజన యూత్‌దే పై చేయిగా ఉంది. దొరతనం, వెట్టిచాకిరీ లాంటివి చాలా వరకు దూరమయ్యాయి. ఈ మార్పులు ముఖ్యంగా పోరాటాల వల్లనేనన్నది నిజం.. కొద్ది క్షణాల్లో గ్రామాల్లోని మార్పులు నా కళ్ళముందు కదిలి రాజేశ మాటలకు తలూపాను...

'' ఒకప్పుడు మీ పార్టీలో రెండవస్థానంలో ఉన్న సత్యమూర్తి, విప్లవగీతాలెన్నో రాసిన సత్యమూర్తి బయటకొచ్చాడు.. కుల రాజకీయాల్లో మునిగి తేలుతున్నాడు. మీ పార్టీలోనూ అగ్రవర్ణాల అధిపత్యముందన్న ఆరోపణలున్నాయి...''

అమర్ మాటలకు కొంత ఇబ్బందిగా ముఖం పెట్టాడు రాజేశ్.. కొద్ది సేపాగి అన్నాడు.

'' ఆ ఆరోపణల్లో కొంత నిజం లేకపోలేదు. ఇప్పటివరకూ మా పార్టీ నాయకత్వం అగ్రకులాల వారి చేతుల్లో ఉండటం వల్ల అలా అనుకోవడానికవకాశం కలిగింది. నిజానికి మాకే కులభేదాలూ లేవు.. కుల రహిత సమాజం స్థాపించడమే మా ధ్యేయం.. మా పార్టీకి నాయకత్వమెవరు వహించినా ముఖ్యంగా మా వెంట ఉన్నది అట్టడుగు కులాలవారే. నిరంతరం దోపిడీకి, పీడనకు గురవుతున్నవారే. ఇక బయటకు రావడం సంగతి.. ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు వాళ్ళవి కొన్ని సమయాల్లో సిద్ధాంత భేదాలూ కారణమవుతాయి..''

''నేను మార్క్సిజాన్ని లోతుగా అధ్యయనం మేం చేయలేదు. కాని కొంతవరకు చదివాను.. నాకు తెలిసినంతవరకు మీరు మార్క్సిజాన్ని మనదేశపరిస్థితులకన్వయించేట్టు కాకుండా సైన్సులాగా, మారని శాస్త్రంలాగా అన్వయించేట్టు చూస్తున్నారు. ప్రతి హింస పేరు మీదనో, మరో పేరుమీదనో మీరు రక్తపాతాన్ని సృష్టిస్తున్నారు. ఇది సరియైందేనా...?'' అన్నాను.

వేళ్ళతో నొసలును టపటప కొట్టుకున్నాడు రాజేశ్..

''ఇది మిడిమిడి జ్ఞానంతో చేస్తున్న విమర్శ దేశపరిస్థితుల కనుగుణంగానే మేము అన్వయించడానికి ప్రయత్నిస్తున్నాం. ముఖ్యంగా మేం చేస్తున్నది ప్రతిహింసే కాని హింస కాదు.. ఒక్కోప్పుడది మా అదుపుదాటీ పోవచ్చు..'' అన్నాడు..

ఇంకేం ప్రశ్నలు వేయాలో నాకర్థం కాలేదు.. ఈలోగా ''మనదేశంలో ఇన్ని మతాలుండగా మీరు హిందూమతాన్నే ఎందుకెక్కువగా విమర్శిస్తారు..? మిగతా మతాలు మంచివనా మీ ఉద్దేశ్యం..?'' అన్నాడు అమర్..

''మీరు పొరపడుతున్నారు.. మాకేమతమైనా ఒక్కటే.. మతం మత్తుమందన్నది అన్ని మతాలకూ వర్తిస్తుంది... హిందూమత ధోరణులు మరింత ప్రమాదకారి కాబట్టే మేం దాన్నెక్కువ విమర్శిస్తాం..మాకున్నది వర్గ శత్రువులే కాని మత శత్రువులు కారు..''

''మరి దేశానికి స్వాతంత్ర్యమే రాలేదనడం తప్పుడు అవగాహన కాదా..? అతివాద ధోరణికాదా..?''

ఎంతో తెలివైన ప్రశ్న వేసాననుకున్నాను నేను.

'' దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్న భ్రమలో ఉంటే ఉండండి. మాకేం అభ్యంతరం లేదు... నిజానికి మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందా..? ఒక్కసారి ఆలోచించండి... తెల్లతలలు పోయి నల్లతలలొచ్చాయే తప్ప ఏ విషయంలో మార్పులొచ్చాయో చెప్పండి.. ఇప్పటికి మన దేశం ఎన్ని దేశాల కూడిగం చేస్తూ బతకాల్సి వస్తుందో మీకు తెలియదా..? ఈ రోజు మనదేశంలో మనం మన కార్మికులకు మన ఇష్టమున్నట్టు జీతాలిచ్చుకునే పరిస్థితులు లేవు. రైతులు ఇష్టమున్న పంట పండించుకునే స్థితి లేదు. మన ఆర్థిక, రాజకీయ స్థితులపై విదేశీయుల ప్రభావముంది..? ప్రతి పార్టీని ఒక్కో దేశం వెనుకుండి నడిపిస్తుంది..'' అన్నాడు రాజేశ్.

''మిమ్మల్లను, రష్యా చైనాలు నడిపిస్తున్నట్టు..'' అన్నాడు అమర్. ఆ మాటలకు నవ్వే సమాధానంగా చెప్పాడు రాజేశ్. చాలాకాలంగా నాలో సుళ్ళు తిరుగుతున్న ప్రశ్ననడిగిరాజేశ్‌ను ఇరకాటంలో పెట్టామనుకున్నాను. ఆ ప్రశ్నకాతడేం సమాధానం చెబుతాడో చూడాలనుంది.

''ఒకప్పటి మాటేమోకాని ఇప్పుడుమాత్రం మనదేశంలో, మన రాష్ట్రంలో, తెలంగాణా జిల్లాల్లోనూ మధ్యతరగతి జనాల సంఖ్య గణనీయంగానే ఉంది...మీ పోరాటాల పట్ల ఈ జనాల స్పందన దాదాపు శూన్యం. ఏమైనా ఆకర్షితులవుతున్నరంటే మీ పోరాటాల పట్ల అట్టడుగుజనాలే.. గణనీయమైన సంఖ్యలో ఉన్న మధ్య తరగతిని వదులుకొని మీ ఉద్యమాన్నెలా విజయవంతం చేస్తారు..? పోతే మీ ఉద్యమానికి నాయకత్వం వహించేవాళ్ళలో మధ్యతరగతి వాళ్లున్నారు ''జనాలేమో అంటే మధ్యతరగతి జనాలు పోరాటాల పట్ల అనాసక్తంగా ఉన్నారు. ఈ వైరుధ్యాన్ని గూర్చి ఏమంటారు రాజేశ్..?''

నా ప్రశ్నతో రాజేశ్‌ను మంచిదెబ్బే కొట్టాననుకున్నాను. అది నిజం కూడా..'' రాజేశ్ ముఖంలో

ఏదో బాధ కనబడిందినాకు.. ముఖమదోలా పెట్టాడు.. కొద్ది క్షణాలాలోచించి అన్నాడు.

''మనోహర్! నువ్వు చాలా మంచి ప్రశ్నేవేసావు. దీన్నిగూర్చి అన్ని ఉద్యమాలు నడిపేవాళ్ళూ ఆలోచించాల్సిన అవసరముంది. అయితే ఒక్క విషయం మాత్రం జ్ఞాపకముంచుకోవాలి. ఈ దేశంలోని మధ్యతరగతికి ఈ వ్యవస్థపై కొన్ని భ్రమలున్నాయి. దీనిద్వారా ఏదో ఒరుగుతుందనుకుంటున్నారు. రోజు రోజుకీ తలకు బొప్పెలు కట్టే దెబ్బలు తగులుతున్నా వాళ్ళకున్న భ్రమలు తొలగిపోవడం లేదు.. చాలీ చాలని జీతాలు, కొంపలు రోజూ చుస్తూ బతికేట్టు చేస్తున్నా తామేదో గొప్పగా బతుకుతున్నామనుకుంటారు.. ఓ తీరు జీతాలున్న వాళ్ళూ పెద్దగా సమస్యలు లేకుండా ఉంటున్నారని నేననుకోను. ఇందుకు మధ్యతరగతి మేధావులూ మినహాయింపు కాదు.. ఈ జనం దృష్టంతా పై పైకి పోవాలనే. అందుకోసం నానా తంటాలుపడుతుంటారు.. గొంగళి పురుగుల్లా పైకెగబాకడానికి ప్రయత్నిస్తుంటారు. అయినా కిందికే జారుతుంటారు. షేర్లనీ, ప్రమోషన్లనీ, పిల్లలకు గొప్ప చదువులనీ రకరకాల ఒత్తిళ్ళతో, భ్రమలతో బతుకుతుంటారు. వాళ్ళకీ వ్యవస్థపై నున్న భ్రమలు తొలగాలంటే కొంత సమయం తీసుకుంటుంది..''

రాజేశ్ మాటలు నాకు సూటిగానే తగిలాయి... ఆతడు సాధారణీకరించి చెబుతున్నా నా గురించే చెబుతున్నట్టనిపించింది. నాకు రోషమొచ్చింది.

''అందులో తప్పేముంది...? ఈ సమాజంలోనే భద్రతుందని భావిస్తున్నారు. నాలాంటి మధ్యతరగతి వాళ్ళు. ఇదేమన్న కాని పనా..? అవును. చిన్నదో పెద్దదో ఉద్యోగమిచ్చి ఎంతో కొంత సుఖంగా బతకడానికి అవకాశం కల్పించిందీ వ్యవస్థే.. అలాంటి వ్యవస్థపై భద్రతా భావముండటంతో నాకైతే తప్పు కనబడటంలేదు. అది అవసరం కూడా...! తమ బతుకులు భద్రంగా ఉన్నాయనుకున్నప్పుడు ఆ వ్యవస్థకు, దేశానికి వినమ్రులై ఉంటేనే తప్పా...?'' అన్నాను కోపంగా...

''భద్రత... భద్రత...'' రెండుమూడు సార్లని బిగ్గరగా నవ్వాడు రాజేశ్... కొద్ది క్షణాలు నవ్వి

''నా నవ్వు మీకు విలన్ నవ్వులా అనిపిస్తుంది కదూ! మీ కున్న భ్రమలు చూస్తుంటే నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాక నవ్వాను...'' అన్నాడు...కొద్దిసేపాగి తానే అన్నాడు.

''మీరీ వ్యవస్థలో భద్రతుందని భావిస్తున్నారు... మీకిక్కడెలాంటి భద్రతుంది..? ఆర్థిక భద్రత గూర్చి ఆలోచిస్తాం. నోరు కట్టుకొని, అన్ని సరదాలూ చంపుకొని దాదాపుగా ఒక్కపూటకు తిన్నట్టుగా తింటూ అతికష్టంగా నెలకు కొంత డబ్బు వెనుకేస్తారు. బ్యాంకుల్లోనో, షేర్లలోనో పెడతారు. షేర్ల సంగతెలా ఉంటుందో హర్షద్‌మెహతాకేసు ఋజువు చేసింది.. ఎప్పుడు నిండా మునుగుతారో మీకే తెలియదు. తెలిసినా ఇన్ని జిమ్మిక్స్‌ని తట్టుకొని ఎంత మంది తేలుతారు..? ఎన్నో బ్యాంకుల్లో కుంభకోణాలు అవి మూతపడటం చూస్తూనే ఉన్నారు... వాళ్ళెప్పుడు ముంచుతారో మీకు తెలియదు. ఒకవేళవి సక్రమంగానే ఉంటాయనుకున్నా జెట్‌వేగంతో పెరుగుతున్న ద్రవ్యోల్బణం రేటు, ధరల పెరుగుదలతో పోలిస్తే ఐదేండ్లకో ఆరేండ్లకో రెట్టింపయ్యే మీ కొచ్చే డబ్బు విలువెంత..? వడ్డీ మాట వదిలిపెడితే మీరు పెట్టింది మీకొస్తే ఎక్కువే... ఆ డబ్బుకు కొనుగోలు విలువేముంటుంది...?

మీకున్న ఉద్యోగ భద్రత సంగతి ఉద్యోగాలను కాపాడుకోవడానికెన్ని పాట్లు పడాలో, ఎంతగా వ్యక్తిత్వాన్ని చంపుకొని బతుకాలో ఆలోచిస్తే మీకే తెలుస్తుంది. అయినా ఎన్నో ఫ్యాక్టరీలు, ప్రభుత్వరంగ సంస్థలు మూసివేయబడుతూనే ఉన్నాయి. ఎంతో మంది ఏటూకాని వయసులో రోడ్లమీద పడ్తూనే

ఉన్నారు. ఈ మాత్రం అవకాశం కూడా లేని వారీదేశంలో కోట్ల సంఖ్యలో ఉన్నారు. జీతాలు పెరుగుతున్నాయని మురిసిపోతుంటారు. మీలాంటి వాళ్ళు. నిజానికి మీ నిజవేతనాలు తగ్గుతున్నాయన్న విషయం మీకు తెలియదు.

మీకు భద్రతుందని గ్యారంటీ ఉంటే మీ పిల్లలను సృజనాత్మకతకు దూరం చేసి పుస్తకాల పురుగులను చేసిరాచి రంపాన పెట్టరు..' మీ పిల్లలకు భవిష్యత్తులో పని దొరకదన్న అభద్రతా భావంతోనే కదా మీరు పిల్లలను పోటీకోసం తయారు చేస్తున్నారు. అయినా వాళ్ళు మీరనుకున్నట్టవుతారన్న గ్యారంటీ ఉందా..? అయినా ఎంత మంది..? మరి మీకు భద్రతెక్కడుందో చెప్పండి''.

రాజేశ్ మాటలు విని వణికిపోయాను నేను... ఇంతకాలంగా నేనెంతో భద్రంగా బతుకుతున్నాననుకుంటున్నాను.. కానినా భద్రమైన బతుకులో ఎంత అభద్రతుందోనాకు రాజేశ్ మాటలవల్ల అర్థమైంది. లక్షలాది నిరుద్యోగుల సంగతి వదిలిపెడితే, పరిశ్రమలు మూతపడటం వల్ల ఉద్యోగాలుకోల్పోయినవేలాదిమంది జ్ఞాపకం వచ్చి నా మనసు చలించింది. 'యు. టి. ఐ. బేంకుల్లాంటివి భవిష్యత్తులో చేతులెత్తితే.. నా కూతురు పెళ్ళికోసం, నా కొడుకు పైచదువుల కోసం ఎన్నో వ్యయప్రయసల కోర్చి దాచుకున్న డబ్బు తిరిగొస్తుందా..? అప్పుడు నేను బతు గలనా...? నా భవిష్యత్ పథకాలన్నీ అప్పుడేమవుతాయి..?' నాలో ఎన్నెన్నో ప్రశ్నలు.

నేను చదువుకున్న చరిత్రలోని కొన్ని విషయాలు జ్ఞాపకం వచ్చాయి... సంచుల్లో డబ్బు తీసుకెళ్ళి చేతుల్లో వస్తువుల తెచ్చుకున్నారని చదివిన సంగతులూ మదిలో మెదిలాయి. మొట్టమొదటిసారిగా భద్రమనుకున్న నా బతుకుపై అనుమానం కల్గింది.

నేనేం మాట్లాడలేదు.. అమర్ కూడా ఆలోచనలో పడ్డాడు.... ఇదువరకే ఎన్నో పత్రికలు మార్చి తుమ్మితే ఊడిపోయేట్టున్న ఈ ఉద్యోగం గూర్చి ఆలోచిస్తున్నట్టున్నాడు.

కొద్దిసేపాగి మళ్ళీ రాజేశే అన్నాడు.

''మనోహర్...! నువ్వు షేర్లేమైనా కొన్నావా..?''

''లేదు.. నాకు వాటిపై నమ్మకం లేదు'' అన్నాను.

మనోహర్... బాగా ఉన్నవాళ్ళ సంగతి తర్వాత కాని ఈ వ్యవస్థలో ఎవరికి భద్రతుందో చెప్పు..! స్త్రీలపై అత్యాచారాలు, దొమ్మీలు, హత్యలు, దోపిడీలు ఎన్నో... ఇంకెన్నో.. ఆర్థిక భద్రతతో పాటు జీవిత భద్రత అనుమానమే.. పారిశ్రామికవేత్తల, బాగా ఉన్నవాళ్ళపిల్లలు మత్తుమందులకు, దుర్వ్యసనాలకు బానిసలు కావడం, కొందరు ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తూనే ఉన్నాం.. కిడ్నాప్‌లు, హత్యలు, తీవ్రవాదం లాంటివి ఉండనే ఉన్నాయి. అట్టడుగు, మధ్య తరగతి జనంలోలా వాళ్ళకు సమస్యలున్నాయని నేను చెప్పడం లేదు. కాని ప్రస్తుతం వాళ్ళ భద్రత కూడా సందేహాస్పదమే... అయినా ఈ వ్యవస్థలో భద్రతున్నట్టు చాలామంది ముఖ్యంగా మధ్య తరగతి వాళ్ళు భావించడం నాకాశ్చర్యమనిపిస్తుంది... అందరికీ భద్రతను చేకూర్చే సమసమాజ రాజ్య స్థాపనే మా పోరాటాల అంతిమ లక్ష్యం...''

రాజేశ్ మాటలు నాలో ఎన్నో ఆలోచనలు లేపాయి.

''అందరికీ భద్రతను చేకూర్చే వ్యవస్థ ఎలా సాధ్యమవుతుంది? ఎన్నో ఆశలతో నిర్మించుకున్న సోసలిస్టు రష్యా ఆశా సౌధం కుప్పకూలి పోయింది కదా...! అలాగే చాలా దేశాల్లో జరిగింది.. చైనా! కూడా అదే దారిలో పయనిస్తుందని చాలా మందనుకుంటున్నారు. ఇలా గట్టిగా తుమ్మితే ఊడిపోయే

ముక్కులాంటి వ్యవస్థ కోసం లక్షలాది జనాల రక్తతర్పణం దేనికి..? మీరూహించే సమాజం రావడం సాధ్యమా. ? వచ్చినా ఎన్ని రోజులుంటుంది...?''

నేననాలనుకున్న మాటలనే అన్నాడు అమర్...

ఆ మాటలు విని చిన్నగా నవ్వాడు రాజేశ్.

''కారణాలేవైనా రష్యా కుప్పకూలి పోయిందన్నమాట నిజమే. దాని వెనుక పెట్టుబడిదారీ దేశాల హస్తాలున్నాయన్న సంగతి ప్రపంచానికంతా తెలుసు... ఓ వ్యవస్థ కూలిపోయి మరో వ్యవస్థ రావడమనేది అసహజమేం గాదు... అట్లని ఉన్న చోటనే ఉందామనుకుంటానంటే చెప్పేదేం లేదు... రష్యా కూలిపోయినా అక్కడెంత ప్రతిఘటనుందో, తాము ఎన్నో బలిదానాలు చేసి నిర్మించుకున్న వ్యవస్థను నిలుపుకోవడానికెంత పెనుగులాటుందో అక్కడి పరిస్థితుల నూహానచేసుకుంటేనే తెలుస్తుంది. మనిషికి సాధ్యం కానిదేదీ లేదన్నది మరిచి పోవద్దు. ఈ రోజు కలనుకున్నదే. రేపు నిజమవుతుందన్న నమ్మకం మాకుంది...'' అని లేచి నిల్చున్నాడు.

రాజేశ్‌తో పాటు మేమూ నిల్చున్నాం.

భోజనం చేస్తూ మరెన్నో విషయాలు మాట్లాడుకున్నాం.

వస్తున్నాయి. వస్తున్నాయ్

రథ చక్రాల్.. రథ చక్రాల్

జగన్నాథ రథ చక్రాల్

భూమార్గం పట్టిస్తాను..

భూకంపం సృష్టిస్తాను..

శ్రీశ్రీ గేయంలోని చరణాలుపాడి మాకు వీడ్కోలు చెప్పాడు రాజేశ్...

ఎప్పట్లాగే మా కళ్ళకు గంతలు కట్టి ఎక్కడెక్కడో తింపి రోడ్డెక్కించి వెళ్ళిపోయారు రాజేశ్ అనుచరులు.

రాజేశ్ ఎన్ని చెప్పినా వాళ్ళ ఉద్దేశ్యం ఎంత పవిత్ర మైందైనా వాళ్ళ హింసాయుత చర్యలు, రక్తపుటేర్లు పారిస్తున్న పనులు మాత్రం నాకు నచ్చడం లేదు... అయితే భద్రత గూర్చి రాజేశ్ అన్న మాటలు నన్ను అనుక్షణం వెంటాడుతూనే ఉన్నాయి.

ఇండియాటుడే పక్షపత్రిక 6-20 జూన్ '97